ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
19 జనవరి
2026




# నర్సన్న సన్నిధిలో భక్తుల సందడి

## ఉచిత దర్శనానికి రెండు, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి చేశారు. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన భక్తులతో.. యాదగిరిగుట్ట ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. కొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపం.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా నారసింహుడి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.48,86,826 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.18,71,585, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6,87,500, వీఐపీ దర్శనాల ద్వారా రూ.9.45 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.3,69,300 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.








# లేగ దూడలను చంపిన టైగర్

**ఇబ్రహీంపూర్ లో పులి చంపిన లేగదూడను పరిశీలించిన ఫారెస్ట్ ఆఫీసర్లు**

**రైతులు అప్రమత్తంగా ఉండాలి.. పులికి హాని కలిగిస్తే చర్యలు**

**జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లాలో పులి సంచారం కలకలం సృష్టిస్తోంది. శనివారం రాజాపేట మండలం బేగంపేటలోని ఓ రైతు పొలంలో టైగర్ అడుగులను గుర్తించిన రైతు.. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పాద ముద్రలను పరీక్షించి పులి అడుగులేనని అధికారులు నిర్ధారించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. కాగా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఓ రైతు వ్యవసాయ బావి వద్ద ఒక లేగ దూడ చనిపోయి ఉంది. సమాచారం తెలుసుకున్న జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి.. ఫారెస్ట్ ఆఫీసర్లతో కలిసి ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి లేగ దూడను చంపింది టైగరేనని నిర్ధారించారు. కాగా రెండు లేగ దూడలకు గానూ ఒకటి గాయాలతో చనిపోయి ఉండగా.. మరొకటి కనిపించడం లేదు. పులి రెండు దూడలను చంపి ఆహారం కోసం ఒక లేగదూడను అడవిలోకి లాక్కెళ్లి ఉంటుందని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పులి ఒకే సమయంలో దాదాపుగా 12 కిలోల వరకు మాంసాన్ని ఆహారంగా తీసుకుంటుందని, ఆ క్రమంలో రెండు లేగదూడలను చంపి ఒక లేగదూడను ఫారెస్ట్ లోకి లాక్కెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి.. పులికి హాని కలిగిస్తే చర్యలు

పులి సంచారం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పులికి ఎవరైనా హాని కలిగించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్(డీఎఫచవతీతీచ) సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. అడవుల్లో పాంథర్లు సంచరించడం సర్వసాధారణ విషయమే అయినా పులులు సంచరించేంత దట్టమైన అడవులు జిల్లాలో లేవని తెలిపారు. ఆహారం కోసం సిద్ధిపేట జిల్లా నుండి యాదాద్రి జిల్లాలోకి పులి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నామని పేర్కొన్నారు. పులులు తలదాచుకునేంత దట్టమైన అడవులు జిల్లాలో లేని కారణంగా.. సదరు పులి ఇక్కడే ఒకేచోట ఉండే అవకాశం ఏ మాత్రం లేదన్నారు. ఆహారం కోసం పులి ఒకచోట నుండి మరోచోటకు వెళ్తూ ఉంటుందని, వ్యవసాయ పనుల కోసం అడవులకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వ్యవసాయ పనుల కోసం ఒంటరిగా అస్సలు వెళ్లొద్దని, సాయంత్రం వేళల్లో త్వరగా పనులు ముగించుకుని ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. అదేసమయంలో పులి సంచారం కారణంగా టైగర్ ను బంధించడం కోసం బావుల వద్ద కరెంట్ షాక్ వంటి ఏర్పాట్లు చేయొద్దని రైతులకు సూచించారు. రైతులను అప్రమత్తం చేయడం ఎంత ముఖ్యమో, పులిని కాపాడడం కూడా తమకు అంతే ముఖ్యమని, ఎవరైనా పులికి హాని కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రేవంత్ తీరు అరాచకం..

## రాష్ట్రంలో రౌడీయిజం రాజ్యమేలుతుందా?: సుర్వి యాదయ్య గౌడ్ ఆగ్రహం



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష పార్టీ జెండా దిమ్మెలను కూల్చాలని పిలుపునివ్వడంపై బీఆరచవతీతీచస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు ఇవే:

### హోంమంత్రి హోదాలో ఉండి.. నేరాలను ప్రోత్సహిస్తారా?

"శాంతిభద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, హోంమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి.. స్వయంగా విద్వేషాలను రెచ్చగొట్టడం దుర్మార్గం. బహిరంగంగా ఆస్తుల ధ్వంసానికి పిలుపునివ్వడం అంటే నేరాన్ని అధికారికంగా ప్రోత్సహించడమే. ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు."

### డీజీపీ మౌనం దేనికి సంకేతం?

"రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలేశారా? సాక్షాత్తు సీఎం నేరపూరిత వ్యాఖ్యలు చేస్తుంటే.. రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారు? పోలీసు యంత్రాంగం తన బాధ్యతను మరిచిపోయిందా? విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీపై లేదా?"

### రాజకీయంగా చేతకాకే ఈ భౌతిక దాడులు

"రాజకీయంగా ఎదుర్కోలేక, భౌతిక దాడులకు, జెండా దిమ్మెల ధ్వంసానికి రేవంత్ రెడ్డి దిగజారారు. ఇది ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. అభివృద్ధి చేయడం చేతకాక, విద్వేషాలతో కాలం గడుపుతున్నారు."

### ప్రజలే బుద్ధి చెబుతారు

'తెలంగాణలో అరాచకాన్ని సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజలే మీకు కర్రు కాల్చి వాత పెడతారు."

# చెరువుగట్టు దేవాలయం ధర్మకర్తగా రఘునాథ్ నియామకం

## డాక్టర్స్ కాలనీ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**నకిరేకల్ :** నకిరేకల్ పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త శివాలయం మాజీ చైర్మన్ నకిరేకల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వీరవెల్లి రఘునాథ్ ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చెరువుగట్టు దేవస్థానం నూతన ధర్మకర్తగా నియమితులయ్యారు ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నకిరేకల్ డాక్టర్స్ కాలనీ అక్షర గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీవాసులు .. బంధువులు శ్రేయోభిలాషులు రఘు కవిత దంపతులను ఘనంగా సన్మానించారు

# మేడారం భద్రతలో డ్రోన్ టెక్నాలజీ...

## సమ్మక్క-సారలమ్మ జాతర భద్రతా ఏర్పాట్లపై డీజీపీ సమీక్ష...



జనగామ, జనవరి 18: (రోమింగ్ న్యూస్ ) : దేశం నలుమూలల నుండి లక్షల సంఖ్యలో భక్తులు మరోవైపు మంత్రులు ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులు సినీ ప్రముఖులు దర్శించుకునే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రత్యేకమైన అధునాతనమైన డ్రోన్లను ఏర్పాటు చేసి వాటి పర్యవేక్షణలో ప్రత్యేకమైన బందోబస్తు ఏర్పాటు చేశారు మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా చేపట్టిన భద్రతా (బందోబస్తు) ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ శివధర్ రెడ్డి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం సందర్శించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నియంత్రణ, సమ్మక్క సారలమ్మ ఊరేగింపు మార్గాలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రియల్ టైమ్ మ్యాప్స్, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా అధునాతన డ్రోన్ టెక్నాలజీ ద్వారా పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.

### పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు.....

ఈ సమీక్ష సమావేశంలో ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ జాతర సందర్భంగా అమలు చేస్తున్న భద్రతా ప్రణాళికలు, పోలీసు బలగాల మోహరింపు, ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై డీజీపీకి వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు డిజిపి సూచించారు. ఈ సమావేశంలో ఐజీ మల్టీ జోన్-1 చంద్రశేఖర్ రెడ్డి, అంబర్‌కిషోర్ ఝా, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, కరీంనగర్ సీపీ గౌస్ ఆలమ్, మహబూబాబాద్ ఎస్పీ శబరిష్, భూపాలపల్లి ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, డీసీపీ అంకిత్ శివం ఉపాధ్యాయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

